క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్


ఆర్డీవోను మర్యాద పూర్వకంగా కలిసిన తహసీల్దార్ రమాదేవి

తుగ్గలి : మండల తహసీల్దార్‌గా రమాదేవి బుధవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆమెను ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెకు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. అంతకు ముందు ఆమె పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో భరత్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రైతులకు శిక్షణ


రైతులకు శిక్షణ ఇస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్లు

చిప్పగిరి:సాగులో అమలవుతున్న సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని బెల్డోణ గ్రామంలోని రైతులకు సాగులో మెలుకువలు, సాంకేతికత, అధిక దిగుబడి సాధన తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ పంటలకు సోకే తెగుళ్ల, నివారణ చర్యలపై సూచనలు చేశారు. ఏఓ విజయలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో తెగుళ్లు అదుపు


నగరదోణలో విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయలక్ష్మి

చిప్పగిరి: ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే పంటలకు సోకే తెగుళ్లను నివారించవచ్చని ఏఓ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని నగరడోణ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో నూతన విధానాలు, ఆధునిక పనిముట్లు, యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మల్లమ్మ,పంచాయతీ కార్యదర్శులు సిసింద్రీ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి


కైరుప్పలలో వీఏఏ బసవరాజుకు వినతి పత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఆస్పరి: ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలకృష్ణ, రామాంజినేయులు, నరసింహులు, రవి, పెద్ద వీరభద్రి, రాము, చిన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కైరుప్పల గ్రామ సచివాలయంలో వీఏఏ బసవరాజుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి పనులు చేపట్టకపోవడంతో చాలా మంది కూలీలు తెలంగాణ ప్రాంతానికి వలస వెళ్తున్నారన్నారు. కూలీలకు పనికి తగ్గట్టు వేతనం ఇవ్వాలని, పని చేసిన వెంటనే వారంలోపు వేతనాలు అందేటా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు.

10న ఓపెన్ క్రికెట్ టోర్నీ

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలో ఈనెల 10 నుంచి ఓపెన్ క్రికెట్ (టెన్నిస్ బాల్) టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గ్రామంలో ఈనెల 20న ఈశ్వర ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు రూ.500 ఎంట్రీ ఫీజు ఈ నెల 9వ తేదీ లోపు చెల్లించి టీమ్ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9963489290, 8886137061 నంబర్లను సంప్రదించాలన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి. విరూపాక్షి

ఆలూరు: ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే బి. విరూపాక్షి సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో బుధవారం ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చాలా గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను గత సమావేశాలల్లో ప్రస్తావించినా నేటికీ పరిష్కరించకపోవడంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పనులు కల్పించకపోవడంతో చాలా మంది వ్యవసాయ కూలీలకు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని చెప్పారు. అయినా అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని చూస్తే వారి పనితీరు ఎలాంటిదో అర్థమవుతోందన్నారు. పశువులు, బర్రెలు, మేకలు షెడ్లను అధికార పార్టీకి చెందిన కార్యకర్తలకు మంజూరు చేస్తే వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో రైతులు లేరా అని అధికారులకు ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాల్లో వంట ఏజెన్సీలను తొలగించడం, వారికి అనుకూలమైన వారిని నియమించుకోవడాన్ని విద్యాశాఖ అధికారులు మానుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీలు శ్రీరాములు, నాగవేణి, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, ఎంపీటీసీలు జీరా నాగమ్మ,మోతి ఎల్లమ్మ, బోయ ఎల్లమ్మ, దేవరాజ్, సర్పంచ్‌లు దేవి రెడ్డి, సుధాకర్‌రెడ్డి ,డీటీ విజయ్‌కుమార్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు చౌడారెడ్డి, రాంనేలా, ఎంఈఓ కోమలాదేవి పాల్గొన్నారు.

సిబ్బంది సమయ పాలన పాటించాలి

పత్తికొండ(తుగ్గలి) :గ్రామ సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. బుధవారం పట్టణంలోని సచివాలయం-3, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలపై ఆరా తీశారు.

వలసలొద్దు..పనులు కల్పిస్తాం

మద్దికెర : మండలంలో వ్యవసాయ పనులు ముగిసిన గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తామని, ఎక్కడికీ వలసలు పోవద్దని ఏపీఓ నర్సిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులకు పొలాల్లో కావలసిన ఉపయోగకరమైన పనులు గుర్తించాలన్నారు. ఉపాధి కూలీలు ఎక్కడికి వలసలు పోకుండా సొంత గ్రామాల్లోనే పనులు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు అడిగిన వెంటనే పనులు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సిబ్బంది రాఘవేంద్ర, సుధాకర్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.



డిసెంబర్ 14న లోక్ అదాలత్


పత్తికొండలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్ఎస్ భారతి

పత్తికొండ(తుగ్గలి) : హైకోర్టు ఆదేశాల మేరకు వచ్చే నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి తెలిపారు. బుధవారం కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ సమావేశం మందిరంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులు, సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహార కేసులు, బ్యాంకు, తదితర రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు రవి కుమార్, సహాయ కార్యదర్శి వాసు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బ్రహ్మగుండం అభివృద్ధికి నిధులు కేటాయించాలి


బ్రహ్మగుండంలో కోనేరును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): బ్రహ్మగుండం క్షేత్రం అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ కోరారు. మండల కేంద్రం సమీపంలోని బ్రహ్మగుండం క్షేత్రంలో బుధవారం వారు పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో ఇక్కడి ఎక్కువ భక్తులు వస్తుంటారని, అయితే ఇక్కడ కనీస ఏర్పాట్లు కూడా చేపట్టలేదని మండిపడ్డారు. ఏర్పాట్లు చేయడంలో ఈఓ విఫలమయ్యారన్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో మహిళా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఆలయ భూములను రక్షించాలన్నారు. సీపీఐ మండల నాయకులు చిన్న మాధులు, రాజు, చిలిపి కృష్ణ పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు రాగిణి, శ్రీలక్ష్మి సూచించారు. బుధవారం స్థానిక వైద్యశాలలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఫీవర్ సర్వే క్రమం తప్పకుండా నిర్వహిస్తూ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. విష జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. ప్రస్తుతం అధికంగా దగ్గు, జ్వరం వంటి వాటితో ప్రజలు ఎక్కువగా వస్తున్నారన్నారు. పరిసరాల శుభ్రత, దోమల నివారణ, చర్యలు, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

వంట ఏజెన్సీలను తొలగించడం అన్యాయం


హొళగుంద ఎమ్మార్పీ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండలంలోని వందవాగిలి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 30 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న వంట ఏజెన్సీకి చెందిన సభ్యులను తొలగించడం అన్యాయమని బీఎస్‌ఎస్ స్టేట్ ప్రెసిడెంట్ రామతీర్థం అమరేష్, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందవరం నరసప్ప ఖండించారు. బుధవారం తొలగించిన ఏజెన్సీ గ్రూపు సభ్యులతో కలిసి స్థానిక ఎమ్మార్సీ ఎదుట ధర్నా చేపట్టారు. నాయకులు వెంకటేష్, ఎల్లప్ప, ప్రసన్న, గడ్డం హుసేనితో కలిసి మాట్లాడుతూ గ్రామంలో 10 గ్రూపులకు చెందిన 80 మంది ఒక్కో సంవత్సరం రెండు గ్రూపులు చొప్పున మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారన్నారు. అయితే ఈ ఏడాది మరో వర్గానికి చెందిన వారి వంతు రాగా గ్రామంలోని కొందరు అధికార పార్టీ నాయకులు అధికారులకు ఫిర్యాదులు చేసి ఏజెన్సీ నుంచి వారిని తొలగించేలా చేశారన్నారు. అధికారులు ఏకపక్షంగా విచారణ చేసి వారిని తొలగించారని ఆరోపించారు.

పశుగణన సర్వే పరిశీలన

మద్దికెర : మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో చేస్తున్న పశుగణన కార్యక్రమాన్ని పశువైద్యాధికారి కృష్ణానాయక్ బుధవారం పరిశీలించారు. ప్రతి ఇంటినీ సందర్శించి పశువుల వివరాలను సమగ్రంగా సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని చెప్పారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

హొళగుంద: మండల కేంద్రంలోని అనాథ వృద్ధులు, దివ్యాంగులకు ఆదోని వివేకనంద సేవా సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, భారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దార్థగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు రవికాంత్ తదితరులు వారికి బియ్యం, కంది బ్యాళ్లు, వంటనూనె సరుకులు పంపిణీ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో 34 నెలల నుంచి సరుకులను అందిస్తున్నట్లు చెప్పారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

హాలహర్వి: మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువులు, పురుగుల మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ శివశంకర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపుల్లో యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగుల మందులను విక్రయించాలన్నారు. ఎరువులు, పురుగు మందులను ఈ మిషన్‌లో రైతుల ఆధార్‌కార్డు నంబర్ నమోదు చేసి ఇవ్వాలని సూచించారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని కోరారు. కర్ణాటక ఎరువులు, పురుగు మందులను, బయో మందులు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.



విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


విగ్రహ ఊరేగింపులో వీరశైవుల విన్యాసాలు

కృష్ణగిరి: చిట్యాల గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలో భాగంగా ఉదయం స్వామి విగ్రహానికి పుణ్యాహవాచనం, గణపతి హోమం నిర్వహించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కర్ణాటకకు చెందిన వీరశైవులు చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.7న ప్రతిష్ఠమూర్తికి అభిషేకం, హోమాలు ఉంటాయని, 8న ఉదయం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ లూక్

కృష్ణగిరి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహకులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ లూక్ హెచ్చరించారు. మండలంలోని ఎస్‌హెచ్ ఎర్ర గుడి, మన్నెకుంట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల వస్తువులను అందజేయాలని చెప్పారు. వంట చేసే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు.

సంక్షిప్తం

నైపుణ్య గణన పకడ్బందీగా చేపట్టాలి

పత్తికొండ(తుగ్గలి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నైపుణ్య గణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఈఓపీఆర్డీ నరసింహులు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15-59 సంవత్సరాల వయస్సుగల వారికి నైపుణ్య గణన సర్వే నిర్వహించాలని చెప్పారు. అన్ని గ్రామాల్లో సర్వే చేపట్టాలని సూచించారు.

పంటల బీమాపై అవగాహన కల్పించండి

హొళగుంద: రబీలో పంటలు సాగు చేసిన రైతులకు పంటల బీమాపై అవగాహన కలిగించి ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏఓ ఆనంద్ లోకదళ్ రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఆర్ఎస్‌కే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌లో బీమా వర్తించాలంటే రైతులే ప్రీమియం చెల్లించాలన్నారు. శనగ, వరి, ఉల్లి, జొన్న, వేరుశనగ ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద, టమాటకు వాతవరణ ఆధారిత బీమా కింద వర్తిస్తుందన్నారు. బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులే ప్రీమియం చెల్లిస్తాయని ఇతరలు సీఎస్‌సీ, ఆర్ఎస్‌కే లో సంప్రదించాలని చెప్పారు. పప్పుశనగకు గ్రామస్థాయి యూనిట్‌లో ఎకరాకు రూ.420, మండల స్థాయి యూనిట్ కింద ఎకరాకు జొన్నకు రూ.297, వేరుశనగకు రూ.420, టమాటకు రూ.1,500, ఉల్లికి రూ.1,350, వరికి రూ.630 చెల్లించాలన్నారు. డిసెంబర్ 15 నాటికి ప్రీమియం చెల్లించాలని, వరికి మాత్రం డిసెంబర్ 31 వరకు గడువు ఉందని వివరించారు. కాఏఈఓ విరుపాక్షి, ఎంపీఈఓ నరసింహ, వీఏఏలు పాల్గొన్నారు.

రోడ్ల పనులకు ఆటంకాలు లేవు

ఆలూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భూమి పూజ చేసిన సీసీ రోడ్ల పనులకు ఎలాంటి ఆటంకాలు లేవని ఆలూరు పీఆర్ డీఈ ఎస్.మనోహర్ తెలిపారు. చిప్పగిరి, దేవనకొండ మండల కేంద్రాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను బుధవారం పరిశీలించామన్నారు. స్థానిక డీఈ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హాలహర్వి, హొళగుంద, ఆలూరు మండలాల్లో రోడ్డు పనులను రోడ్లు లెవెలింగ్, కంకర పరిచే పనులు పూర్తయ్యాయన్నారు. అయితే కొన్ని మండలాల్లో ఇసుక రీచ్‌లలో అధికంగా వరద నీరు ఇంకా పారడం వల్ల ఇసుక రవాణకు ఇబ్బందులు ఉన్నాయన్నారు. పీఆర్ పరిధిలోని ఆరు మండలాలకు 184 సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులకు మొదటి ఫేజ్ కింద రూ.11.47 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు.

స్ప్రేయర్ల పంపిణీ

హొళగుంద: మండలంలోని హెబ్బటం గ్రామంలో రైతులకు సబ్సిడీ కింద హోండా స్ప్రేయర్ పంపులను బుధవారం పంపిణీ చేశారు రైతు సేవా కేంద్రంలో హార్టికల్చర్ విలేజ్ ఆఫీసర్ పవన్, గ్రామపెద్దలు వన్నూరప్ప, పక్కీరప్ప, లక్ష్మయ్య, ఈరన్న తదితరులు..లబ్ధిదారులు లింగన్న, మహేష్, వెంకోబ, ఎర్రిస్వామి, హుసేనప్పకు అందజేశారు. ఒక పంపునకు రూ.22,500 పూర్తి ధర చెల్లిస్తే సబ్సిడీ పోనూ తిరిగి రూ.8,000 రైతు ఖాతాలో జమ అవుతుందని వీఏఓ పవన్ తెలిపారు.





ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

తుగ్గలి : ఉపాధి హామీ పథకంలో బినామీ పేర్లతో మస్టర్లు వేసి అవినీతికి పాల్పడుతున్న ఫీల్డ్‌అసిస్టెంట్లు, సీనియర్ మేట్లపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శ్రీరాములు డిమాండ్ చేశారు. ఉపాధి పనులు కల్పించి వలసను నివారించాలని కోరుతూ బుధవారం తుగ్గలి సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఉపాధిలో రాజకీయ జోక్యం లేకుండా పనికి వెళ్లే ప్రతి కూలీకి పని కల్పించాలని కోరారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు వారంలోగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న రమిజాబీ

ఆస్పరి: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి రమిజాబీ విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. నాయకురాళ్లు దస్తగిరిమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

